RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 349 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 24-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 349 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 24-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం..

ఐరాసలో పాక్‌కు భారత్ చురకలు

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. ఐరాస తరువాయి 2లో..

ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

కీలక సమావేశం

చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు

రెబల్స్ సమస్యను పరిష్కరించి, సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ ముగిసింది. సీఎం నివాసంలో సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు తరువాయి 2లో..

8 నుంచి 10 నెలలపాటు ప్రమాదకరమైన పరిస్థితులు

ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి



హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

ఎల్‌నినో కూడా కరోనా లాంటి విపత్కర పరిస్థితేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (=వఝుత్‌ష్ట్ర తీవఽఽఎ) అన్నారు. ప్రజాభవన్‌లో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు.. ఎల్‌నినో ప్రభావం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, సర్.. తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. "మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ప్రజల భాగస్వామ్యం లేకుండా కరవును ఎదుర్కోలేము. కరోనా సమయంలో కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఎండలకు కరోనా చచ్చిపోతుందని ఆనాడు కేసీఆర్ చెప్పారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు అని రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 100కు పైగా దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉంది. మహారాష్ట్ర లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్రంలోనూ నీటి ఎద్దడి ఉంది. ఆ రాష్ట్రంలో 20శాతం తక్కువ నీటిని వాడాలని నిర్ణయించారు. మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఎండల తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. కరవును ఎలా ఎదుర్కోవాలనే అంశంపై తరువాయి 2లో..

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

చంద్రబాబుపై జగన్ ఫైర్

నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్

వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు

సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

తరువాయి 2లో..

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..

బీజేపీ సంచలన ఆరోపణలు

రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ

ఈ వివాదంతో తన కుమారుణ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ

రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న

రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత తరువాయి 2లో..

రేకుల షెడ్డు కింద చదువులు..

స్పందించిన మంత్రి లోకేశ్

అల్లూరి జిల్లాలో రేకుల షెడ్డు కింద విద్యార్థుల చదువులు

డూంబ్రిగూడ మండలానికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్

పాఠశాల భవనాన్ని తక్షణమే బాగుచేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి, సిటిజన్ టైమ్స్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల షెడ్డు కింద చదువుకుంటున్న దుస్థితిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, అల్లూరి సీతారామరాజు జిల్లా డూంబ్రిగూడ మండలంలోని ఓ పాఠశాలలో సరైన భవన సదుపాయం లేదు. దీంతో అక్కడి విద్యార్థులు ఓ తాత్కాలిక రేకుల షెడ్డు కింద కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. ఈ హృదయవిదారక దృశ్యాలను ఓ యువకుడు వీడియో తీసి, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'శ' (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో కొద్ది సమయంలోనే వైరల్‌గా మారి, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. ఈ పోస్ట్‌పై తరువాయి 2లో..

భారత్, పోలండ్ విస్తృత రక్షణ బంధం

2030 కల్లా 6 బిలియన్ డాలర్లకు వాణిజ్యం -ఇరు దేశాల ప్రధానుల నిర్ణయం

మోదీ తన మిత్రుడు కావడం గర్వకారణమన్న టుస్క్

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

భారత్, పోలండ్‌ల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిశ్చయించాయి. మన దేశంలో 3 రోజుల పర్యటనకు వచ్చిన పోలండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్ తరువాయి 2లో..

దూసుకొస్తున్న భారీ తుఫాన్...

ఉత్తరాంధ్రకు పెను గండం

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఒక భారీ తుఫాన్ దూసుకుని వస్తోంది. అది ఉత్తరాంధ్ర కు, దక్షిణ ఒడిషాకు మధ్యలో కేంద్రీకృతమై అలజడి రేపనుంది. ఆగ్నేయం దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం ఈ నెల 24 నాటికి వాయుగుండంగా మారనుంది. అది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 25 నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఇక ఈ నెల 26వ తేదీ సోమవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో భారీ తుపానుగా మారే అవకాశం తరువాయి 2లో..

ఎడిటోరియల్

తమ్ముళ్లు గెలిచి బాబును ఓడించేశారా?

టీడీపీలో కొత్త కల్చర్!

రాజకీయాల్లో రాజకీయం అవసరమే కానీ అదే మొత్తం కాకూడదన్న వాదనను వినిపించే అధినేతల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఒకరు. దేశ రాజకీయ చరిత్రలో నమ్మిన సిద్ధాంతాన్ని పక్కాగా ఫాలో అయ్యే అధినేతల నుంచి అవసరాలకు అనుగుణంగా సిద్ధాంతాల్ని పాక్షికంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ ముందుకు సాగిన రాజకీయ తరానికి చెందిన అధినేతగా చంద్రబాబును చెప్పొచ్చు. అలాంటి ఆయన రాజకీయాల్లో అధికృత కోసం తనను తాను మార్చుకున్న తన కోర్ సిద్ధాంతాన్ని మార్చుకున్న దాఖలాలు ఇప్పటివరకు కనిపించదు. ప్రత్యర్థి పార్టీలు ఎంత దూకుడు ప్రదర్శించినా.. కొంత పెద్దరికాన్ని ప్రదర్శించాలన్న తీరును ఆయన అనుసరిస్తుంటారు. క్యాడర్ ఎంతగా అరిచి గీపెట్టినా.. దూకుడు.. దుందుడుకు రాజకీయాలను ప్రదర్శించే విషయంలో ఆయన నెమ్మదితనాన్ని ప్రదర్శించటం కనిపిస్తుంది. నేతలు.. క్యాడర్ నుంచి ఒత్తిడి వచ్చినా.. సరేనంటూ తన మార్క్ రాజకీయం నుంచి బయటకు రావటం కనిపించదు. ఈ కారణంతోనే చంద్రబాబును అమితంగా ఆరాధించే టీడీపీ అభిమానులు సైతం ఆయనపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఆయన రాజకీయ జీవితంలో ఒక దశ వరకు కాలానికి అనుగుణంగా మార్పుల్ని ఆహ్వానించినప్పటికి.. దూకుడు రాజకీయాల విషయంలో మాత్రం ఆయన తనను తాను మార్చుకునే విషయంలో వెనుకబడి ఉన్నారన్న విమర్శ సొంత పార్టీ నుంచే బలంగా వినిపించే పరిస్థితి. ఈ తీరుకు తాజాగా ఏపీలో జరుగుతున్న స్థానిక ఎన్నికలతో చెక్ పడినట్లే. 2024 ఎన్నికలకు ముందు చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు.. చంద్రబాబు సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఎదుర్కోని గడ్డు పరిస్థితులు మాత్రమే కాదు.. వారాల తరబడి జైలు జీవితాన్ని చవిచూసిన చంద్రబాబు తనను తాను మార్చుకునే విషయంలో గతంలో పెట్టుకున్న పరిమితుల్ని పక్కన పెట్టేశారని చెప్పాలి. అలా అని పూర్తిగా కాకున్నా.. పాక్షికంగా సడలించేశారు. అలా అని తాజా మార్పులకు తాను ప్రత్యక్షంగా ప్రోత్సహిస్తున్నానన్న అపవాదు రాకుండా.. వ్యూహాత్మక మౌనాన్ని ఆశ్రయిస్తున్నట్లుగా చెప్పాలి. తెలుగుదేశం పార్టీకి రథసారధిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఒకలా వ్యవహరించిన చంద్రబాబు.. తాజాగా జరుగుతున్న స్థానిక ఎన్నికల వేళ వ్యవహరిస్తున్న తీరుకు స్పష్టమైన మార్పు ఉందన్న మాట బలంగా వినిపిస్తోంది. తన రాజకీయ ప్రత్యర్థికి ఏ మాత్రం తీసిపోని విధంగా క్యాడర్ ను ప్రోత్సహించక తప్పని పరిస్థితులు చంద్రబాబుకు ఎదురైనట్లుగా చెబుతున్నారు. పాతకాలపు సౌమ్య రాజకీయ శైలికి భిన్నంగా పార్టీ మారకపోతే.. రానున్నరోజుల్లో మరిన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయన్నవాదనకు తలొగ్గినట్లుగా కనిపిస్తోంది. ఈ కారణంగానే ప్రత్యర్థి వైసీపీ దూకుడుకు తగ్గట్లే తాము కూడా దూకుడు ప్రదర్శిస్తే..తమకు ముకుతాడు వేసే పగ్గాలు చంద్రబాబు నుంచి తప్పించినట్లుగా చెప్పాలి. ఇదంతా చూస్తున్న కొందరు చంద్రబాబును ఓడించి తమ్ముళ్లు గెలిచేశారన్న వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే.. ఇందులో నిజం ఎంతన్నది చూస్తే మాత్రం విషయం మరోలా కనిపిస్తుంది. పాత పద్ధతుల్ని పాటించే విషయంలో చంద్రబాబు దారిని వదిలేసి..లోకేశ్ యువ నాయకత్వంలో దెబ్బకు దెబ్బ అదే అధికారాన్ని తమకు సొంతం చేస్తుందన్న వాదనకు టీడీపీ క్యాడర్ షిఫ్ట్ అయ్యిందని చెప్పాలి. తెగింపు.. మొరటుతనంతోనే ప్రత్యర్థిని ఢీకొట్టాలే తప్పించి..పాతకాలం సౌమ్య విధానాన్ని పాటిస్తే పార్టీ మొత్తంగా మునుగుతుందన్న వాదనను నమ్మినట్లుగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. ఏపీలో జరుగుతున్న తాజా స్థానిక ఎన్నికల సందర్భంగా టీడీపీ నేతలు.. క్యాడర్ వ్యవహారశైలి చూస్తే.. తెలుగుదేశం కొత్త తరం పగ్గాల్ని పూర్తిగా తీసేసుకున్నట్లుగా కనిపిస్తోంది. మార్పును అంగీకరిస్తూ.. మారిన కాలానికి అనుగుణంగా రాజకీయ వ్యూహరచన చేసే యువ నాయకత్వాన్ని చంద్రబాబు మౌనంగా చూస్తున్నట్లుగా చెబుతున్నారు.

8 నుంచి 10 నెలలపాటు ప్రమాదకరమైన పరిస్థితులు

చర్చించాం. కరవు, విపత్తులను మనం నిలువరించలేము. కరవుపై 6 నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. 3 నెలల క్రితం ఎల్‌నినో ప్రభావం పెద్దగా లేదు. ఏదోలా వానాకాలం పంటల నుంచి బయటపడ్డాం" "ఈ ఏడాది 20వేల మెగావాట్లకు పైగా విద్యుత్ వినియోగం జరిగింది. వచ్చే నాలుగు నెలలు సాగుకు చుక్కనీరు కూడా దొరకదు. తాగడానికి నీళ్లు లేవు.. ఇక వ్యవసాయానికి నీళ్లు ఎలా ఇస్తాం? తాగునీటి అవసరాలు తీర్చుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదు. ఇది క్యాన్సర్ లాంటి నిజం.. ముందే ప్రజలకు చెప్పడం మంచిది. సాగు నీరే లేనప్పుడు వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం అసాధ్యం. రిజర్వాయర్లలో 20శాతం కూడా నీటి నిల్వలు లేవు. కృష్ణా జలాల్లో 200 టీఎంసీలు కూడా లేవు. నీటిని పొదుపుగా వాడుకోవాలి. 8 నుంచి 10 నెలలపాటు ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం"

"ఎక్కువ ధర పెట్టి విద్యుత్ కొందామన్నా దొరకట్లేదు. కరెంటు విషయంలో పొదుపు మంత్రం పాటించాలి. ప్రభుత్వ ఆఫీసుల్లో పగలు ఫ్యాన్లు వేయొద్దు. ఏసీల వాడకాన్ని తగ్గించుకోవాలి. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలి. గడ్డుకాలం రాబోతోంది.. ప్రజలను అప్రమత్తం చేయాలి. పశుసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టే ఓపిక మన నేతలకు ఉండట్లేదు. ప్రజలకు సరిగ్గా వివరించకపోతే.. మనం రాజకీయంగా దెబ్బతింటాం. మనం వాస్తవాలు చెప్పకపోతే.. బీఆర్ఎస్ నేతల ప్రచారాన్నే జనం నమ్ముతారు" అని సీఎం వ్యాఖ్యానించారు.

ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి

"ప్రతిమా శ్రీనివాసరావు కోసమే కేసీఆర్ యాదాద్రి విద్యుత్ కేంద్రం నిర్మించారు. ప్రతిమా శ్రీనివాసరావుకు 50ఏళ్లలో రూ.లక్ష కోట్ల లాభం వచ్చేలా కేసీఆర్ వ్యూహం పన్నారు. రూ.లక్ష కోట్ల అవినీతి చేసేందుకే యాదాద్రి విద్యుత్ కేంద్రం కట్టారు. నీళ్లు, నిధులు, నియామకాలు.. అన్నీ కేసీఆర్ కుటుంబానికే వచ్చాయి. నీళ్లు ఫామ్‌హౌస్‌కు వెళ్లాయి.. నిధులు బీఆర్ఎస్ పార్టీ ఖాతాకు వెళ్లాయి. చేసిన పనిని చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డాం. ఎల్‌నినో సమయంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వడం అనేది అద్భుతమైన విజయం. సంక్రాంతి పండుగ తర్వాత నుంచి మే నెలాఖరు వరకు ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి. ప్రజాప్రతినిధుల ఫోన్లలో మానిటరింగ్ యాప్ పెట్టి పర్యవేక్షిస్తాం. గ్రామాల్లో, వ్యవసాయ భూముల్లో మట్టి పనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తాం. ప్రతి మనిషికీ పని కల్పించాలి.. ప్రతి ఒక్కరికీ కడుపు నిండా అన్నం పెట్టాలి. ఇందు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలి" అని సీఎం తెలిపారు.

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..

బీజేపీ సంచలన ఆరోపణలు

ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

భారత్, పోలండ్ విస్తృత రక్షణ బంధం

ప్రధాని మోదీ మధ్య గురువారం దిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. ఇందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం ఉన్నాయి. ఉక్రెయిన్-రష్యా, పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్, పోలండ్‌లు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. "పోలండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించాం. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించాం" అని మోదీ పేర్కొన్నారు. "రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జామ్‌నగర్, కొల్హాపుర్ రాజ కుటుంబాలు.. పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమిచ్చాయి. 2022లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలండ్ సహకరించింది" అని మోదీ వివరించారు. తమ డ్రోన్లు ఎంతో ఉపయోగకరమని పోలండ్ ప్రధాని ఓ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. అయితే వివరాలను వెల్లడించలేదు.

టుస్క్ గౌరవార్థం విందు

విందు సమావేశం సందర్భంగా భారత్, పోలండ్ ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, డొనాల్డ్ టుస్క్‌లతో ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు పోలండ్ ప్రధాని టుస్క్ గౌరవార్థం హైదరాబాద్ హౌస్‌లో గురువారం మధ్యాహ్నం ప్రధాని మోదీ విందు సమావేశం నిర్వహించారు. దీనికి 20 మంది పోలండ్ ప్రతినిధులు, 20 మంది భారత వాణిజ్య, పారిశ్రామిక, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. వీరిలో 'ఈనాడు' ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు ఉన్నారు.

దూసుకొస్తున్న భారీ తుఫాన్...

ఉత్తరాంధ్రకు పెను గండం

ఉందని అంచనా వేస్తున్నారు.

నాలుగు రోజుల పాటు :

ఇక ఈ భారీ తుఫాన్ మరింత బలపడి ఆ తదుపరి మూడు రోజులలో ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇక అల్పపీడనం అనంతరం వాయుగుండం ఆ మీదట తుఫాన్ ఈ విధంగా పరిణమించే ఈ ప్రకృతి విపత్తు ప్రభావంతో రాష్ట్రంలో అటు కోస్తా జిల్లాల నుంచి ఇటు ఉత్తరాంధ్రా వరకూ పలు చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయి. భారీ తుఫానుగా మారిన తరువాత సోమవారం నుంచి ఉత్తరాంధ్రా జిల్లాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు అలాగే తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు మరో మూడు రోజుల పాటు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వివరించారు.

తీరం దాటే ముందు :

ఉత్తరాంధ్రా కేంద్రంగా ఏర్పడే భారీ తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి తో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతే కాదు తీర ప్రాంతాలలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో మొదలై తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 110 నుండి 140 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని ఐఎండీ తెలిపింది. ఇక అక్టోబర్ 28 ఉదయం పూట ఈ తుఫాను ఉత్తరాంధ్ర ఒడిశా సరిహద్దుల మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని అంటున్నారు. ఉత్తరాంధ్రాలో ఏ జిల్లాను దాటుతుందో అన్నది ఇపుడు చర్చగా ఉంది. గత నెలలో తుఫాను అయితే శ్రీకాకుళం వద్ద తీరం దాటింది. దాంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈసారి ఏ విధంగా తుఫాన్ గమనం ఉండబోతోంది అన్నదే అధయయం చేస్తున్నారు.

అంతా అప్రమత్తంగా :

ఈ తుఫాను అక్టోబర్ 28న ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీరాల మధ్య ల్యాండ్‌ఫాల్ అయ్యే అవకాశం ఉండటంతో కోస్తాంధ్ర ప్రాంతానికి భారీ ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ భారీ తుఫాన్ ప్రభావంతో ఈ నెల 29 దాకా భారీ వర్షాలు పడతాయని చెబుతున్నార్లు ఉండొచ్చు అని అంటున్నారు. దాంతో సాధారణ ప్రజలు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

కీలక సమావేశం

ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. అదేవిధంగా, ఫేక్ వాట్సాప్ గ్రూపుల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం..

సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలని సూచించారు. అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. 'అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు' అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. '1999లో కార్గిల్‌లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరం. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వదిలేసిన సమయంలో .. వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది. ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు. అలాంటి ఉగ్రవాదుల హక్కుల కోసం ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కుల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం' అని మంగళానందన్ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

రేకుల షెడ్డు కింద చదువులు..

స్పందించిన మంత్రి నారా లోకేశ్, సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాన్ని తక్షణమే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యపై మంత్రి లోకేశ్ వేగంగా స్పందించి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

బస్సుల కోసం ప్రయాణికుల పరుగులు.. తగరపువలసలో ఇదేం దుస్థితి!

బస్సు స్టాప్ లేక రోడ్డుపైనే నిరీక్షణ.. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలకు తప్పని ఇక్కట్లు

సిటిజన్ టైమ్స్,భీమిలి,అక్టోబర్ 23:
తగరపువలసలో ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. సరైన బస్‌స్టాప్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళల్లో పనులు, విద్యాసంస్థలకు వెళ్లాల్సిన వారు బస్సుల కోసం జాతీయ రహదారిపై చాలాసేపు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం తగరపువలసలో ప్రయాణికులు బస్సుల కోసం రహదారిపై నిరీక్షిస్తూ తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొందరు బస్సులు ఆపకపోవడంతో వాటిని అందుకోవడానికి కొంతదూరం పరుగులు తీయాల్సి వచ్చిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగకపోవడం, ప్రయాణికులకు అనుకూలమైన నిరీక్షణ స్థలం లేకపోవడం వల్ల రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని వాపోయారు.

ప్రయాణికుల భద్రతకు ముప్పు.. పట్టించుకునేదెవరు?

జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచి ఉండటం, బస్సులు కనిపించగానే వాటిని అందుకోవడానికి పరుగులు తీయడం ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు ఇలాంటి పరిస్థితుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి బస్సులు అందకపోవడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు.. ఉద్యోగులు కార్యాలయాలకు చేరుకోవడంలో ఆలస్యం జరుగుతోందని ప్రయాణికులు చెబుతున్నారు.

ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండాల్సిన ప్రాంతంలో బస్సుల కోసం రోడ్డుపై పరుగులు తీయాల్సి రావడం విచారకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రయాణికులకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించడంలో సంబంధిత అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

ఎన్నికల వేళైనా ప్రజా సమస్యపై స్పందించాలి!

ప్రస్తుతం స్థానిక ఎన్నికల సందడి నెలకొన్న నేపథ్యంలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని రాజకీయ నాయకులను కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను కలుస్తున్న నాయకులు, వారి రోజువారీ

ఇబ్బందులను కూడా గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచిస్తున్నారు. తగరపువలసలో ప్రయాణికుల సమస్యను ఆర్టీసీ అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తగరపువలసకు కావాల్సింది హామీలు కాదు.. ఆచరణలో పరిష్కారం!

తగరపువలసలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నిలిపేలా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట అధికారిక బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రయాణికులు సురక్షితంగా వేచి ఉండేందుకు షెల్టర్, కూర్చునే సదుపాయం, బస్సుల రాకపోకలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సుల నిలుపుదలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తగరపువలసలో బస్‌స్టాప్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు సహా ప్రతి ప్రయాణికుడికి సురక్షితమైన ప్రయాణ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

4వ వార్డులో కూటమి అభ్యర్థి సుష్మితకు మద్దతుగా గంటా రవితేజ ఇంటింటా ప్రచారం

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23
జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 4వ వార్డు కూటమి అభ్యర్థి పాసి సుష్మితకు మద్దతుగా గంటా రవితేజ ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలతో మమేకమై స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల్లో పాసి సుష్మితకు మద్దతు తెలిపి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గంటా రవితేజ పిలుపునిచ్చారు.

కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతా.. డబ్బులు అడుగుతున్న మోసగాళ్లు

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, ప్రజలకు కలెక్టర్ పేషీ హెచ్చరిక



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ వాట్సాప్ ఖాతాను సృష్టించి, పలువురికి సందేశాలు పంపిస్తూ డబ్బులు కోరుతున్నట్లు కలెక్టర్ పేషీ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేషీ హెచ్చరించింది. కలెక్టర్ పేరు, గుర్తింపును ఉపయోగించి డబ్బులు కోరుతూ వచ్చే అనుమానాస్పద వాట్సాప్ సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని సూచించింది. అటువంటి సందేశాలను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని స్పష్టం చేసింది. అలాగే వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని పేర్కొంది. కలెక్టర్ పేరుతో వచ్చే సందేశాల విషయంలో వాటి నిజానిజాలను అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించింది. ఇలాంటి మోసపూరిత సందేశాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ పేషీ కోరింది.

జనసేన కూటమి జడ్పీటిసి అభ్యర్థిగా లింగోలు నాగపావని

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 23
రూరల్ మండలం జడ్పీటిసి జనసేన కూటమి అభ్యర్థిగా లింగోలు పావని శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ లింగోలు పండు. తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

12వ వార్డు జనసేన ఇన్‌చార్జిగా

ఈగల మహేష్ సూర్య నియామకం

జీవీఎంసీ ఎన్నికల బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం

విశాఖ దక్షిణ, తూర్పు నియోజకవర్గాల నాయకులతో ఎన్నికల సమీక్ష

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా గ్రేటర్ విశాఖ పరిధిలోని 12వ వార్డు పార్టీ ఇన్‌చార్జిగా ఈగల మహేష్ సూర్యను పార్టీ అధిష్ఠానం నియమించింది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది.

ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం

జనసేన పార్టీ నగర కార్యాలయంలో శుక్రవారం విశాఖ దక్షిణ, విశాఖ తూర్పు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులతో జీవీఎంసీ ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఎన్నికల కార్యాచరణ, నాయకులు నిర్వహించాల్సిన బాధ్యతలు, క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే విధానాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. జీవీఎంసీ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

ఎన్నికల నిర్వహణను పటిష్ఠం చేసేందుకు విశాఖ దక్షిణ, విశాఖ తూర్పు నియోజకవర్గాల్లో రీజినల్ ఇన్‌చార్జిలతో పాటు వార్డు ఇన్‌చార్జిలను నియమించారు. ఇందులో భాగంగా 12వ వార్డు బాధ్యతలను ఈగల మహేష్ సూర్యకు అప్పగించారు. నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు చేరువ కావడం, వార్డులో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడం ఆయన ముందున్న ప్రధాన బాధ్యతలుగా ఉన్నాయి. ఈ నియామకంతో 12వ వార్డులో జనసేన పార్టీ కార్యకలాపాలను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

దత్తత ప్రక్రియపై కారా బృందం పరిశీలన

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23
విశాఖ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మద్రిపాలెం శిశుగృహను కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తున్న సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. శిశుగృహలోని చిన్నారుల వివరాలు, దత్తత ప్రక్రియ, దత్తత కోసం వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించింది. కారా దక్షిణ రాష్ట్రాల సమన్వయకర్త లివియా మేరియం పాల్ శిశుగృహ రికార్డులను తనిఖీ చేశారు. దత్తత అనంతరం చిన్నారుల వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల స్థితి, గృహ సందర్శన సమయంలో పరిశీలించే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిశుగృహ ద్వారా అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, దత్తత ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో సమావేశమై కమిటీ విధివిధానాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దత్తత వనరుల సంస్థ ప్రోగ్రాం అధికారులు విజయలక్ష్మి, సురేఖ, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరికృష్ణ, రక్షణ అధికారి దాసరి చంద్రశేఖర్, ఎల్‌సీపీవో అనిజ కుమారి, మేనేజర్ ఎ. సుజాత, సోషల్ వర్కర్ ఎస్.వి.ఎస్. రామలక్ష్మి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, సభ్యులు, శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.

అయోడిన్ లోప రుగ్మతల నివారణకు అవగాహన కార్యక్రమాలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నివారణ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు శుక్రవారం గోడపత్రిక, బ్యానర్‌ను ఆవిష్కరించారు. అక్టోబర్ 21 నుంచి 28 వరకు ప్రజల్లో అయోడిన్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోడిన్ లోపం వల్ల గొంతు వాపు, పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. వీటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా మధురానగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం జడ్పీటీసీ కాంగ్రెస్ అభ్యర్థిగా వాకపల్లి సువర్ణ



ఉప్పలగుప్తం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
ఉప్పలగుప్తం మండల జడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వాకపల్లి సువర్ణ నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకపల్లి రాంబాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు దామిశెట్టి జయ ఆధ్వర్యంలో ఆమె తరపున నామినేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం సహించం..

ఏర్పాట్లపై జీవీఎంసీ కమిషనర్ సమీక్ష

లోపాలు గుర్తిస్తే చర్యలు తప్పవు.. ఆర్వోకు షోకాజ్ నోటీసు జారీకి ఆదేశం

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం అదనపు కమిషనర్ పి.ఎం. సత్యవేణితో కలిసి భీమిలి జోన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. భీమిలి జోన్‌లోని ఐదు వార్డులకు సంబంధించి చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, భద్రపరచడం, పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భీమిలి జోన్ పరిధిలో మొత్తం 78 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం ఇద్దరు రిటర్నింగ్ అధికారులు, 84 మంది పోలింగ్ అధికారులు, 84 మంది సహాయ పోలింగ్ అధికారులు, 263 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రిటర్నింగ్ అధికారి వి. సతీష్ రాజుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోతే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమావళి పుస్తకాన్ని పూర్తిగా అధ్యయనం చేసి, నిబంధనల ప్రకారం బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం తగరపువలస బంగ్లామెట్టలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఓటరు స్లిప్పులను ఇంటింటికీ సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ విజయ్ కుమార్, ఎస్ఈ శాంతిరాజు, ఈఈ వెంకటవాసు, డీసీపీ వెంకటేశ్వరరావు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో అక్రమ మద్యం పట్టివేత..

727 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

ఇద్దరు వ్యక్తులు అదుపులోకి.. కేసు నమోదు

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
అక్రమ మద్యం రవాణాపై భీమిలి పోలీసులు చర్యలు చేపట్టి 727 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన భీమిలి మండలం దాకమర్రి గ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. భీమిలి సీఐ దివాకర్ యాదవ్ ఆదేశాల మేరకు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిలో విజయనగరం జిల్లా కలగాడ గ్రామానికి చెందిన రాయివరపు విజయం (33), అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం వారాడ గ్రామానికి చెందిన దొగ్గ ముత్యాల నాయుడు (44) ఉన్నారు. వారి నుంచి 727 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీటీసీ అభ్యర్థిగా తాట్రాజు అప్పారావు నామినేషన్

ఎంపీపీ అభ్యర్థిగా అవకాశం.. గంటా చొరవ

ఆనందపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23
ఆనందపురం మండలం బోని ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తర్లువాడకు చెందిన తాట్రాజు అప్పారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆనందపురం మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న అప్పారావును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అభ్యర్థి బీఆర్‌బీ నాయుడు సహా కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

సీవోసీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, అక్టోబర్ 23 (సిటిజన్ టైమ్స్):
జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన సిటీ ఆపరేషన్స్ సెంటర్ (సీవోసీ) పనితీరును జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల సమాచారం, వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని సేకరించి నివేదికలు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. సోషల్ మీడియా పోస్టులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై నిరంతర నిఘా ఉంచి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, జాయింట్ డైరెక్టర్ డి. విజయభారతి, మేయర్ రిటర్నింగ్ అధికారి బి. దయానిధి తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్సీపి జడ్పిటిసిగా మట్టపర్తి నాగ విజయలక్ష్మి నామినేషన్

అయినవిల్లి సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 23 :
పి. గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమలాపురం జిల్లా పరిషత్ ఆఫీస్ లో అయినవిల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా మట్టపర్తి నాగ విజయలక్ష్మి వెంకటరమణ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తాం: వరుదు కళ్యాణి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
విశాఖ నగరంలో పర్యావరణ పరిరక్షణకు, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తెలిపారు. శుక్రవారం సెంట్రల్ పార్క్, వైఎస్సార్ పార్కుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి వాకర్స్‌ను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తే పార్కుల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి, పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గొల్ల బాబురావు, పార్టీ నాయకులు, పలువురు కార్పొరేటర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జిల్లాలో మాతృ మరణాలను నివారించేందుకు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మాతృ మరణాలపై సబ్ డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వైలెన్స్ అండ్ రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు నెలలో పెందుర్తి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, న్యూ గాజువాక పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి చొప్పున నమోదైన మాతృ మరణాలపై సమీక్షించారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు జరగకుండా సంబంధిత వైద్యాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, టీకాలు, పోషకాహారం, ఇతర ఆరోగ్య సేవలను సకాలంలో అందించాలని తెలిపారు. ప్రమాదకర పరిస్థితులున్న గర్భిణులు ప్రసవానికి వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా కేజీహెచ్ లేదా వీజీహెచ్‌కు రిఫర్ చేసి, సురక్షిత ప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై వారికి అవగాహన కల్పించడంతో పాటు, సరైన బర్త్ ప్లానింగ్ రూపొందించాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కౌమారదశలో బాలికల్లో కలిగే శారీరక మార్పులు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మాతృ మరణాల నివారణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి గర్భిణీకి అవసరమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డా. నరేంద్ర సింగ్, డా. లూసి, డా. ఉషాప్రసాద్, డా. బి. ఉమావతి, డా. ఉషాదేవి, డా. శ్రీలక్ష్మి, డా. కె. రోషిణి, డా. టీవీఎస్ నాయుడు, డా. ఎన్.వి. సమత, డా. వై.డి. కళ్యాణి, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ ఎన్నికల వేళ

పెందుర్తిలో పోలీసుల రూట్ మార్చ్

ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్

పెందుర్తి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల్లో భద్రతాభావం కల్పించేందుకు పెందుర్తి పోలీసులు రూట్ మార్చ్ నిర్వహించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సుజాతనగర్ ఏ జోన్, కార్మిక నగర్, పరిసర ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఓటర్లను బెదిరించడం, ఒత్తిడికి గురిచేయడం, ప్రలోభాలకు గురిచేయడం లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పుకార్లను నమ్మవద్దని, ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అవాంఛనీయ ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, ప్రతి ఓటరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ పిలుపునిచ్చారు.

అమలాపురంలో వైసీపీ ఎన్నికల ప్రచారానికి ఊపు

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అమలాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాలు ముమ్మరమయ్యాయి. పార్టీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తూ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల వ్యూహాలపై చర్చిస్తున్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితర నాయకులతో సమావేశమై ప్రచారంపై సమీక్షించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రమణారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాధనాల వెంకట్రావు, మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, పందిరి సుబ్బరాజు, నేరేడుమెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలి

ఎన్నికల ఏర్పాట్లపై అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జీవీఎంసీ రెండవ సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. శుక్రవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తితో కలిసి తూర్పు జోన్ పరిధిలోని రాంనగర్ సమీపంలో ఉన్న సేవా సదన్ స్కూల్, కృష్ణ కాలేజీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లతోపాటు ఓటర్ల సౌకర్యాలు, పోలింగ్ సిబ్బందికి కల్పించాల్సిన వసతులు, భద్రతా చర్యలను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, పారిశుద్ధ్యం, తగినంత వెలుతురు, సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించి ఓటు వేసిన అనంతరం బయటకు వెళ్లేలా క్రమబద్ధమైన మార్గాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటిస్తూ, ఓటర్ల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, ఎన్నికల సామగ్రిని ముందుగానే సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు సందర్శించి, అక్కడి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. పోలింగ్ ఏర్పాట్లలో ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిచేయాలని, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూర్పు జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్,డీసీపీ హరిదాస్, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ జోరు

వరుస కట్టిన ప్రధాన పార్టీల నేతలు

గుర్రంకొండ అక్టోబర్ 23 సిటిజన్ టైమ్స్ :
గుర్రంకొండ మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వం చివరి రోజున తీవ్ర ఉత్కంఠ మధ్య ప్రారంభమైంది. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి రోజు కావడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి మద్దతుదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.సమయం ముగిసిపోతుందనే ఆందోళనతో ఉదయం 9 గంటలకే ఇరు ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు గుర్రంకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రధాన గేటు ముందర బారులు తీరారు. కార్యాలయం తెరుచుకోక ముందే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతో సిద్ధంగా నిలబడటంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.ఎన్నికల బరిలో దిగడానికి ఇరు పార్టీల నేతలు పోటాపోటీగా తరలిరావడంతో ఎంపీడీవో కార్యాలయ పరిసర ప్రాంతాలు రాజకీయ కోలాహలంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తుగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, చివరి రోజు కావడంతో చివరి రోజు రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 23:
ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కూటమి జనసేన పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థిని గుబ్బల గంగా రత్న భవాని, ఎన్నికల ప్రచారం నిర్వహించారు: ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. మసీదు నందు ముస్లిం సోదరులను కలిసి జనసేన నగర పంచాయతీ చైర్పర్సన్ అభ్యర్థి గుబ్బల గంగా రత్నం భవాని మద్దతు కోరారు. జనసేన అభ్యర్థి కర్ర వెంకటలక్ష్మి, టిడిపి అభ్యర్థి నిమ్మకాయల విశ్వేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి, కూటమి జాతీయ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల సాయంతో బంగారు గొలుసు గుర్తింపు

బాధితుడికి గొలుసు అప్పగించిన బొల్లారం పోలీసులు

బొల్లారం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
బొల్లారం దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో పోగొట్టుకున్న తులం బంగారు గొలుసును పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బొల్లారం డివిజన్‌లోని వైఎస్సార్ కాలనీలో ఈ నెల 20న దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటున్న సమయంలో స్థానిక యువకుడు శివ తన తులం బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు బుధవారం స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ బాలుడికి బంగారు గొలుసు దొరికినట్లు గుర్తించారు. అనంతరం గొలుసును స్వాధీనం చేసుకుని గురువారం బొల్లారం పోలీస్ స్టేషన్ ఎస్టేచ్ సుధీర్ కుమార్ చేతుల మీదుగా బాధితుడు శివకు అప్పగించారు. పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి అందజేయడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జీవీఎంసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఓటర్లకు మౌలిక వసతులు కల్పించాలి: కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జీవీఎంసీ ఎన్నికలను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, సూచిక బోర్డులు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సున్నిత, అత్యంత సున్నిత కేంద్రాల్లో పటిష్ట భద్రత కల్పించాలని, అవసరమైన చోట్ల వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో రెండో విడత ఎన్నికల సిబ్బంది శిక్షణతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపు కోసం 1,216 టేబుళ్లు సిద్ధం చేయాలని, ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సహాయకులను నియమించాలని స్పష్టం చేశారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్లకు పటిష్ట భద్రత

అభ్యర్థులకు బెదిరింపులుంటే తక్షణ రక్షణ కల్పిస్తాం: ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని వెల్లడించారు. జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలుకు ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, అడ్డంకులు సృష్టించినా వెంటనే సంబంధిత స్థానిక పోలీసు అధికారులను లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన అభ్యర్థులకు తక్షణమే తగిన రక్షణ కల్పించి, నామినేషన్ కేంద్రానికి తీసుకెళ్లి నిర్ణీత గడువులోగా నామినేషన్ దాఖలు చేసేలా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు కలిగించే వారిపై, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై, శాంతిభద్రతలకు

విఘాతం కలిగించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అభ్యర్థులు, ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు.

రామచంద్రపురంలో కూటమి నేతల విస్తృత ప్రచారం

రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుకు మద్దతుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి శుక్రవారం 28, 31వ వార్డులతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 28వ వార్డు అభ్యర్థి దంగేటి పద్మావతి, 31వ వార్డు అభ్యర్థి గుబ్బల వెంకటరమణ సహా కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. పట్టణంలో సుమారు రూ.80 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి సుభాష్ పేర్కొనగా, మేడిశెట్టి శేషారావుకు 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని ఎంపీ హరీష్ మాధుర్ తెలిపారు. గత ఎన్నికల్లో లభించిన ప్రజా మద్దతును కొనసాగించాలని సానా సతీష్ బాబు ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ స్థానానికి జనసేన అభ్యర్థిగా సిరి నాగజ్యోతి నామినేషన్

పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన కార్యక్రమాల్లో చురుకైన పాత్ర



పి. గన్నవరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
పి. గన్నవరం జడ్పీటీసీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా అడ్డగళ్ల సిరి నాగజ్యోతి (సిరి సతీష్) నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేనలో చురుకుగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆమె స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. 2019 ఎన్నికల సమయంలో వీర మహిళగా జనసేన పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించిన సిరి నాగజ్యోతి, 2024 ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యారు. పి. గన్నవరం జడ్పీటీసీ స్థానానికి ఆమె నామినేషన్ దాఖలు చేయడంతో పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, కూటమి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయోడిన్ లోప రుగ్మతల పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

అక్టోబర్ 21 నుంచి 28 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 23:
ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. శరీర ఎదుగుదలకు, మెదడు అభివృద్ధికి, థైరాయిడ్ గ్రంథి పనితీరుకు యోడిన్ ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. అయోడిన్ లోపం వల్ల గాయిటర్ (థైరాయిడ్ గ్రంథి వాపు) తో పాటు పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలను నివారించేందుకు ప్రతిరోజూ ఆహారంలో అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించాలని సూచించారు. జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, ఇతర సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు తెలిపారు. అయోడిన్ లోప రుగ్మతల నివారణకు ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు సూచించారు.

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 23:
స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమలాపురం పట్టణ పరిధిలోని ఎస్.కె.బి.ఆర్. కళాశాల, ఈదరపల్లి ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ సందర్శించి, మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్.కె.బి.ఆర్. కళాశాలలోని కామర్స్ బ్లాక్‌లో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన క్యూలైన్లు, కౌంటింగ్ టేబుళ్లు, భౌగోళిక నమూనా ఆధారంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోని ప్రతి బ్లాక్‌లో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో

పాటు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈదరపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. నామినేషన్ల కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించే అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ ఆఫీసర్ ఎం. నిర్మల్ కుమార్, కొత్తపేట డీఎస్పీ ఎం. శంకర్ మురళీమోహన్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాణి సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం జడ్పీటీసీ బరిలో కాంగ్రెస్ అభ్యర్థి కుడుపూడి శ్రీనివాసరావు

అల్లవరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
అల్లవరం మండల జడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కుడుపూడి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. అమలాపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని శ్రీనివాసరావు తరఫున నామినేషన్ ప్రక్రియలో భాగస్వాములయ్యారు.

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ వినోద్ కుమార్ ఆదేశాలు

మహబూబాబాద్, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
మహబూబాబాద్ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లతో పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలని, ఇంటింటి చెత్త సేకరణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అపరిశుభ్రతకు కారణమవుతున్న పందుల సంచారాన్ని నియంత్రించేందుకు వాటిని పట్టుకునే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ స్పష్టం చేశారు.

జడ్పీటీసీ అభ్యర్థిగా మేడిశెట్టి ఉషారాణి నామినేషన్

అయినవిల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23
అయినవిల్లి మండల జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మేడిశెట్టి ఉషారాణి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. పి. గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమలాపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఎమ్మెల్యే జీఎంఆర్

గడ్డపోతారం పరిశ్రమలో ఇద్దరు కార్మికుల మృతి పట్ల విచారం

జిన్నారం మండలం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరక్ పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందడం విషాదకరమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని, వారి ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ఆస్పత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మృతుల కుటుంబాలకు రూ.70 లక్షల పరిహారంతోపాటు అంత్యక్రియల ఖర్చుల కోసం ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే

వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ నెహ్రూ, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, స్థానిక నాయకులు, అధికారులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన- టిడిపి తరపున విస్తృత ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే

కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి, పట్టణాభివృద్ధిని కొనసాగించాలి-ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 23:
అమలాపురం పట్టణం 33వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు స్వయంగా పాల్గొని కూటమి అభ్యర్థుల విజయం కోసం ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. కూటమి పొత్తులో భాగంగా అమలాపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా లిజనసేన పార్టీ తరపున నల్లా శ్రీధర్ (గాజు గ్లాసు గుర్తుపై)లి,33వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా లితెలుగుదేశం పార్టీ తరపున అబ్బాయి వెంకన్న (సైకిల్ గుర్తుపై)లి పోటీ చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వార్డులోని ప్రతీ ఇల్లూ తిరుగుతూ అభ్యర్థులను పరిచయం చేస్తూ, వారి గుర్తులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అమలాపురం పట్టణ రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 33వ వార్డు సమగ్ర అభివృద్ధి సాధించాలన్నా, పట్టణంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నా కూటమి అభ్యర్థుల గెలుపు అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐక్యంగా నిలిచి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,ఉత్సాహ వంతులైన యువకులు, వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన 109 మంది రైతులకు న్యాయం చేయాలి

ప్రతి పట్టాదారు కుటుంబానికి 100 గజాల స్థలం కేటాయించాలి: కుమార్ గౌడ్

గుమ్మడిదల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో భూములు కోల్పోయిన 109 మంది రైతులకు న్యాయం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులు నిర్వహించిన ఆందోళనలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పరిశ్రమలకు కేటాయించే సమయంలో పరిహారంతోపాటు ప్రతి పట్టాదారు కుటుంబానికి 100 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఇప్పటివరకు హామీ అమలుపై స్పష్టత లేకపోవడంతో ఆందోళనకు దిగినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి కుటుంబానికి 100 గజాల స్థలం కేటాయించి రైతులకు న్యాయం చేయాలని కుమార్ గౌడ్ కోరారు.

భూ రికార్డుల మెరుగుదలకు రీ-సర్వే శిక్షణ

మహబూబాబాద్, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి రీ–సర్వే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్ అధికారులకు, సిబ్బందికి శిక్షణ అందించారు. భూముల సరిహద్దుల గుర్తింపు, భూ రికార్డుల పరిశీలన, సర్వే వివరాల నమోదు, రెవెన్యూ రికార్డులతో వివరాల సరిపోలిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి మండలంలో రీ–సర్వే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రీ–సర్వే బృందాల సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలంలో ఎంపీటీసీ నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును డీఎస్పీ మురళి పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు తగిన భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని డీఎస్పీ మురళి వెల్లడించారు.

విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విషాదం.. లైన్‌మెన్ దినేష్ మృతి

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
కడప జిల్లా పులివెందుల తాలూకా గుణగానిపల్లెకు చెందిన లైన్‌మెన్ దినేష్ (32) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పరిధిలోని హార్టికల్చర్ కళాశాల వద్ద విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. విధుల్లో భాగంగా మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో దినేష్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. స్వస్థలం గుణగానిపల్లె కావడంతో ఈ విషాద వార్త స్థానికంగా కలకలం రేపింది. దినేష్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జడ్పీటీసీ బరిలో కూటమి అభ్యర్థి రత్నకుమారి

ఉప్పలగుప్తం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
ఉప్పలగుప్తం మండలం జడ్పీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థి దేశంశెట్టి రత్నకుమారి నామినేషన్ దాఖలు చేశారు. ఆమె నామినేషన్ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అరిగెల నానాజీ, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, మట్టా ప్రభాకర్, వై. సత్తిబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ డి. లక్ష్మీనారాయణ, కంకటాల రామం తదితర నాయకులు పాల్గొన్నారు. కూటమి శ్రేణులు రత్నకుమారికి మద్దతుగా నిలిచారు.

మామిడికుదురు జడ్పీటీసీ అభ్యర్థిగా బొంతు నీలిమ నామినేషన్

మామిడికుదురు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
మామిడికుదురు మండల జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొంతు నీలిమ నామినేషన్ దాఖలు చేశారు. పి. గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమలాపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పెదవేగి జెడ్పీటీసీగా చింతమనేని సాయి నవ్యశ్రీ నామినేషన్

దుగ్గిరాల నుంచి ఏలూరు వరకు భారీ ర్యాలీ.. అడుగడుగునా ప్రజల స్వాగతం

ఏలూరు / పెదవేగి, అక్టోబర్ 23 (సిటిజన్ టైమ్స్):
ఏలూరు జిల్లా పెదవేగి జెడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని సాయి నవ్యశ్రీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. దుగ్గిరాల నుంచి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం వరకు సాగిన పాదయాత్ర, భారీ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దారిపొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా, పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. నామినేషన్‌కు ముందు నవ్యశ్రీ ఏలూరులోని శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయం, పెదవేగి మండలం రాట్నాలకుంటలోని శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో తల్లిదండ్రులు చింతమనేని ప్రభాకర్, రాధారాణి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

ఉన్నత విద్య.. సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర
ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో పొలిటికల్

సైన్స్‌లో బీఏ ఆనర్స్ పూర్తి చేసిన నవ్యశ్రీ, సోషియాలజీలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధులకు సేవలు, దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ, నిరుపేద యువతకు పోటీ పరీక్షల ఉచిత శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కొల్లేరు సమస్యలపై ప్రజల తరఫున తన వాణిని వినిపించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు.

ప్రజాసేవే లక్ష్యమన్న నవ్యశ్రీ
నామినేషన్ అనంతరం నవ్యశ్రీ మాట్లాడుతూ, తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమం, ప్రాంత సమగ్రాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ పదవిపై పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు బొప్పన సుధా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, మండల పార్టీ అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్, నాగనబోయిన సత్యనారాయణ, మరడాని రవి, నేతల రవి, వంకినేని భాను ప్రకాష్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లాశ్రీధర్ కి ముస్లిం ప్రముఖుల మద్దతు

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ శుక్రవారం మెయిన్‌రోడ్డులోని మెల్ల ముస్తఫా మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దల మద్దతును నల్లా శ్రీధర్ మసీదు ఇమామ్ రాజాతో పాటు ముస్లిం మత పెద్దలను, ప్రముఖులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు మొహమ్మద్ అమీర్, మహమ్మద్ ఆజాం తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల 25, 26వ వార్డుల్లో వైసీపీ నేతల ప్రచారం

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
పులివెందుల మున్సిపాలిటీలోని 25, 26వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ, ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ కిరణ్ కుమార్ రెడ్డి, వైఎస్ శిల్పా రెడ్డి తదితరులు ఎస్‌బీఐ కాలనీ, చౌడమ్మ వీధి, వెంకటసాయి నగర్ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రమీలమ్మతో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. డ్రైనేజీ, వీధి దీపాలు, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రచారంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలోకి 100 మంది వైసీపీ కార్యకర్తలు

గ్రామాభివృద్ధికి అందరూ కృషి చేయాలి

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
తాడేపల్లిగూడెం మండలం మోదుగుంట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు కామన గణపతి ఆధ్వర్యంలో శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. సుమారు 100 మంది కార్యకర్తలు జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరగా, ఆయన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాభిమానాన్ని పొందిన నాయకులను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకుని గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురిలో వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి పల్లకి సేవ

ధర్మపురి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
ధర్మపురి పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం అయ్యగార్ల ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని రాయిచెట్టు ఇసుక స్తంభం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

జడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా గొల్లపల్లి అమూల్య నామినేషన్

మామిడికుదురు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
మామిడికుదురు మండల జడ్పీటీసీ ఎస్సీ రిజర్వుడ్ స్థానానికి కూటమి అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య నామినేషన్ దాఖలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరిన ఆమెకు మామిడికుదురులో ఘన స్వాగతం లభించింది. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అమూల్య, అమలాపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, రాజోలు మండల పార్టీ అధ్యక్షురాలు అనుచూరి సునీత తదితర నాయకులు, కూటమి శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

ఒకటో వార్డు ఎంపీటీసీ అభ్యర్థిగా డీసీ రోజా మారుతి నామినేషన్

సోమందేపల్లి, అక్టోబర్ 23 (సిటిజన్ టైమ్స్):
సోమందేపల్లి మండలంలోని ఒకటో వార్డు ఎంపీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డీసీ రోజా మారుతి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉషా శ్రీచరణ్ ఆశీస్సులతో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో తమ కుటుంబం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు

ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ

సోమందేపల్లి, అక్టోబర్ 23 (సిటిజన్ టైమ్స్):
శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలంలో కూటమికి చెందిన 14 మంది ఎంపీటీసీ అభ్యర్థులు శుక్రవారం ఒకేసారి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్, రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, బీజేపీ యువ నాయకుడు ఎస్.ఆర్. పార్థసారథిరెడ్డి, డీవీ ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశులు, చల్లాపల్లి రామకృష్ణ, సీసీ హరి, జనసేన కన్వీనర్ జబి ఉల్లా తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో హాజరై అభ్యర్థులకు మద్దతు తెలిపారు.

పులివెందుల మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం: బీటెక్ రవి

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం 23, 26వ వార్డుల్లో పోటీ చేస్తున్న లక్ష్మీదేవి, బి. కమలమ్మలకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు అభ్యర్థులుగా అవకాశం కల్పించామని తెలిపారు. పులివెందులలో డ్రైనేజీ సమస్యలు, సిమెంట్ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. క్యాంప్ ప్రాజెక్టు కింద రూ.25 కోట్లతో రోడ్ల నిర్మాణం, రూ.40 కోట్లతో పారిశ్రామిక అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని బీటెక్ రవి కోరారు.

గిద్దలూరులో బీసీ సామాజిక వర్గాల అభ్యర్థిని గెలిపించాలి

కేశన శంకర్‌రావు

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి జెవి.నారాయణ ని గెలిపించాలని కోరుతూ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు శుక్రవారం గిద్దలూరులో ప్రెస్‌మీట్ లో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ సామాజిక వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలని, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడానికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను తనిఖీ చేసిన పరిశీలకురాలు లావణ్య

కాకినాడ, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న మూడో రోజు జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకురాలు బి. లావణ్య వేణి పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ, పత్రాల పరిశీలన, అభ్యర్థులు నామినేషన్ పత్రాలు పూర్తి చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులతో నేరుగా మాట్లాడి ప్రక్రియకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఏఆర్వో, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి. శ్రీలలిత పాల్గొన్నారు.

జడ్పీటీసీ అభ్యర్థిగా కె. రామక్క నామినేషన్

సోమందేపల్లి, అక్టోబర్ 23 (సిటిజన్ టైమ్స్):
సోమందేపల్లి మండలం ఈదులబాలపురం గ్రామానికి చెందిన కె. రామక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, స్నేహితులు, బంధుమిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎన్నికల్లో హింసకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 23:
ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించేలా హింసకు పాల్పడితే సహించేది లేదని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. ఎన్నికల సిబ్బందిపై దాడులు, నామినేషన్ పత్రాల ధ్వంసం, రాళ్ల దాడులు, ఆస్తుల విధ్వంసానికి పాల్పడితే ఆధారాల మేరకు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీడియోలు, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తిస్తామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా 100 లేదా 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

దుర్గా అష్టమి మరియు మహా నవమి కోసం సీరత్ కపూర్ బ్లాక్ కోచర్‌లో స్టన్స్

దేవరకొండ ఇప్పుడు చేయాల్సిందేంటి?



ఒక సినిమా కోసం హీరో ఎంత కష్టపడ్డారనేది మెయిన్. కానీ ఆ కష్టం ప్రేక్షకులకు ఎంతవరకు నచ్చిందన్నదే రిజల్ట్ డిసైడ్ చేస్తుంది. విజయ్ దేవరకొండ విషయంలో ఇదే డిస్కస్ చేసుకోవాల్సిన విషయం. రణబాలిలో ఆయన యాక్టింగ్ కు మంచి మార్కులే పడుతున్నా.. కొన్ని విషయాల్లో మాత్రం ప్రేక్షకులకు అసంతృప్తి ఉంది. దీంతో నటుడిగా నిరూపించుకున్న ఆయన.. సెలక్షన్ లో జాగ్రత్తగా ఉండాల్సిన సమయం వచ్చిందా అనే ప్రశ్న వినిపిస్తోంది.

నిజానికి రణబాలిలో విజయ్ దేవరకొండ తన పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. రోల్ కు తగ్గట్టుగా కనిపించడం దగ్గర నుంచి యాక్షన్ సీన్స్, డైలాగులు చెప్పే విధానం వరకు తనదైన ముద్ర వేశారు. రణబాలి రోల్ లో చూపించిన ఇంటెన్సిటీ సినిమాకు మెయిన్ అసెట్ గా నిలిచింది. రష్మిక మందన్నా కూడా తన పాత్రకు న్యాయం చేశారు. డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ సెలెక్ట్ చేసుకున్న బ్యాక్ డ్రాప్, రూపొందించిన కొన్ని సీన్స్, క్లైమాక్స్ అట్రాక్ట్ చేస్తున్నాయి.

అయితే మంచి స్టోరీ ఉన్నంత మాత్రాన సినిమా మొత్తం ప్రేక్షకులను కట్టిపడేయలేదని ఆ మూవీ మరోసారి గుర్తు చేసింది. కొన్ని చోట్ల స్టోరీ స్లోగా సాగడం, సినిమా రన్ టైమ్ ఎక్కువగా అనిపించడం ఇబ్బందిగా మారాయి. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను చూపించే క్రమంలో వైలెన్స్ కూడా ఎక్కువైంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలోనూ మరింత స్ట్రాంగ్ వర్క్ ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంటే విజయ్ యాక్టింగ్ కంటే, ప్రేక్షకులకు నచ్చేలా మూవీ తీర్చిదిద్దడంలోనే సమస్య ఉందని చెప్పొచ్చు. అయితే విజయ్ కు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయి. రౌడీ జనార్ధన, దర్శకుడు శౌర్యువ్ తో చేయనున్న సినిమాలు లైనప్ లో ఉన్నాయి. ఆ రెండు చిత్రాలు వేర్వేరు బ్యాక్ డ్రాప్స్ లో రూపొందుతున్నాయి. ఒకటి గ్రామీణ వాతావరణంలో సాగే మాస్ యాక్షన్ కథ కాగా, మరొకటి ఎమోషన్స్ తో కూడిన ఫాంటసీ స్టోరీ.అందుకే విజయ్ ఇప్పుడు చేయాల్సింది కొత్త స్టోరీలను ఎంచుకోవడం మాత్రమే కాదు.

అందులో కొన్ని మార్పులు చేసుకోవాలి. స్టోరీలో కొత్తదనం ఉందా, తన పాత్రకు స్ట్రెంత్ ఎంత, ప్రేక్షకులు మొదటి నుంచి చివరి వరకు ఆసక్తిగా చూస్తారా అనే విషయాలను ముందుగానే పరిశీలించాలి. దర్శకుడి ఆలోచన ఎంత బాగున్నా, అది స్క్రీన్ పై అంతే స్ట్రాంగ్ కనిపించేలా ఉండాలి. ఇక విజయ్ లో కొత్త కథలు చేయాలనే ఆసక్తి కనిపిస్తుంది, మంచి క్రేజ్ కూడా ఉంది.

ఆ రెండింటినీ కలిపి ముందుకు వెళ్లడం ఇప్పుడు చాలా అవసరం. కేవలం భారీ బ్యాక్ డ్రాప్, కొత్త లుక్, ఎక్కువ యాక్షన్ ఉంటే సినిమా సక్సెస్ అవుతుందని అనుకోకూడదు. స్ట్రాంగ్ స్టోరీ, ఎమోషన్స్, స్పీడ్ స్క్రీన్ ప్లే కూడా అంతే ముఖ్యం. అందుకే ఇప్పుడు ఆయన ఫోకస్ పెట్టాల్సింది స్టోరీల సెలక్షన్ తోపాటు అవి స్క్రీన్ పై ఎలా చూపిస్తారనే విషయంపై కూడా. విజయ్ నెక్స్ట్ సినిమాల్లో చిన్న చిన్న ఛేంజెస్ చేసుకుంటే కచ్చితంగా మంచి రిజల్ట్ రావొచ్చు.

300వ టీ20 మైలురాయిపై భారత్ గురి.. సూర్యవంశీ రీఎంట్రీపై ఉత్కంఠ!

టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్ మరో రికార్డు ముంగిట నిలిచింది. న్యూజిలాండ్‌తో రేపు జరిగే రెండో టీ20లో బరిలోకి దిగడం ద్వారా టీమిండియా 300 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా చరిత్ర సృష్టించనుంది. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తిరిగి తుది జట్టులోకి వస్తాడా? అన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉన్న భారత్.. రెండో మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేయాలని చూస్తోంది. తొలి టీ20లో ఇదే హాగ్లీ ఓవల్ మైదానంలో భారీ లక్ష్యాన్ని ఛేదించి గెలిచిన భారత జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

సూర్యవంశీకి అవకాశం దక్కేనా?

తొలి మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన భారత జట్టులో బ్యాటర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్ కీలక పాత్ర పోషించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ టీ20ల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. అయితే రెండో మ్యాచ్‌కు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరమయ్యాడు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్ ఆడటం లేదు. దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే వీలుంది. అప్పుడు సంజూ శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తుది జట్టు కూర్పుపై భారత జట్టు యాజమాన్యం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అదే పిచ్.. బౌలర్లకు సవాలే!

తొలి టీ20లో రెండు జట్లూ కలిసి భారీగా పరుగులు సాధించడంతో మరోసారి బ్యాటర్ల ఆధిపత్యం కనిపిస్తుందా? అన్న చర్చ సాగుతోంది. అదే మైదానం, అదే పిచ్‌పై మ్యాచ్ జరగనుండటంతో పరిస్థితులు బ్యాటర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఒక మ్యాచ్ జరగడంతో పిచ్‌పై అరిగిపోయిన భాగాలు బౌలర్లకు కొంత సహకరించవచ్చని తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్.. చివరి వరకు పోరాడినా ఓటమి తప్పించుకోలేకపోయింది. ఈసారి బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని కివీస్ భావిస్తోంది. వరుసగా రెండో ఓటమి ఎదురైతే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తిరిగి పుంజుకోవడం ఆ జట్టుకు కష్టమవుతుంది. ముఖ్యంగా భారత టాప్ ఆర్డర్‌ను త్వరగా కట్టడి చేయడం న్యూజిలాండ్‌కు కీలకం కానుంది.

300వ మ్యాచ్‌లో భారత్ రికార్డు ఏంటి?

అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకు 299 మ్యాచ్‌లు ఆడిన భారత్.. 300వ మ్యాచ్‌తో ఈ ఘనత సాధించిన రెండో జట్టుగా నిలవనుంది. పాకిస్థాన్ 304 మ్యాచ్‌లతో ఈ జాబితాలో ముందుంది. టీమిండియా ఇప్పటివరకు 199 మ్యాచ్‌ల్లో సాధారణ విజయాలు నమోదు చేయగా, సూపర్ ఓవర్, బౌల్ అవుట్ ద్వారా వచ్చిన విజయాలను కలుపుకొని మొత్తం 205 విజయాలు సాధించింది. ఈ చారిత్రక మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్ పట్టుదలగా ఉంది. మరోవైపు స్వదేశంలో సిరీస్‌ను సమం చేయాలంటే న్యూజిలాండ్‌కు ఈ మ్యాచ్ కీలకం. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటాయి.

వడోదరలో శ్రీ చరణి స్పిన్ మాయ.. 197 పరుగులకే జింబాబ్వే ఆలౌట్

జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ప్రపంచ ఛాంపియన్ భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. వడోదర సమీపంలోని కోటంబిలో ఉన్న బీసీఏ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత బౌలర్లు చెలరేగడంతో జింబాబ్వే జట్టు 49.5 ఓవర్లలో 197 పరుగులకే ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్ శ్రీ చరణి కేవలం 23 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఓపెనర్ లోరిన్ ఫిరిని క్రాంతి గౌడ్ తన బౌలింగ్‌లోనే క్యాచ్ పట్టి పెవిలియన్ పంపింది. అదే ఓవర్‌లో మరో వికెట్ తీసే అవకాశం భారత్‌కు లభించినా, వికెట్ కీపర్ రిచా ఘోష్ క్యాచ్ జారవిడవడంతో చిపో ముగేరి-తిరిపానో బతికిపోయింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముగేరి, మరో ఓపెనర్ మోడెస్టర్ ముపాచిక్వా కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పవర్‌ప్లే ముగిసేసరికి జింబాబ్వే వికెట్ నష్టానికి 46 పరుగులు చేసింది.పవర్‌ప్లే తర్వాత కెప్టెన్ స్మృతి మంధాన బంతిని స్పిన్నర్ శ్రీ చరణికి అందించడం సత్ఫలితాలను ఇచ్చింది. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ చరణి తన తొలి ఓవర్లోనే 21 పరుగులు చేసిన ముగేరి-తిరిపానోను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపింది. ఆ తర్వాత తన తర్వాతి ఓవర్లోనే 25 పరుగులు చేసి ప్రమాదకరంగా మారుతున్న మరో ఓపెనర్ ముపాచిక్వాను కూడా గౌడ్ క్యాచ్ ద్వారా పెవిలియన్ చేర్చింది. దీంతో జింబాబ్వే కష్టాల్లో పడింది. కాసేపటికే దీప్తి శర్మ బౌలింగ్‌లో షార్న్ మేయర్స్ (8) కూడా ఔట్ కావడంతో జింబాబ్వే స్కోరు వేగం మందగించింది.ఈ దశలో బెలోవ్డ్ బిజా, న్యాషా గ్వాంజురా కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ జంట వికెట్ల పతనాన్ని అడ్డుకుని స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. ఈ భాగస్వామ్యాన్ని కూడా శ్రీ చరణియే విడదీసింది. 13 పరుగులు చేసిన గ్వాంజురాను రిటర్న్ క్యాచ్ ద్వారా ఔట్ చేసింది. అయినప్పటికీ,

బెలోవ్డ్ బిజా ఒంటరి పోరాటం కొనసాగించింది. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా పట్టుదలగా ఆడి 64 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకుంది. మిచెల్ మవుంగా (29) చివర్లో కొన్ని దూకుడైన షాట్లు ఆడి స్కోరును పెంచే ప్రయత్నం చేసినా, ఆమెను ఔట్ చేయడం ద్వారా శ్రీ చరణి తన నాలుగో వికెట్‌ను ఖాతాలో వేసుకుంది.

చివరకు బెలోవ్డ్ బిజా 92 బంతుల్లో 4 ఫోర్లతో 62 పరుగులు చేసి జట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెను క్రాంతి గౌడ్ ఔట్ చేసింది. ఇన్నింగ్స్ చివరి బంతికి ముందు టెండయ్ మకుషాను దీప్తి శర్మ బౌల్డ్ చేయడంతో జింబాబ్వే 197 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో శ్రీ చరణి 4 వికెట్లు తీయగా, క్రాంతి గౌడ్ 3, దీప్తి శర్మ 2, షఫాలీ వర్మ ఒక వికెట్ పడగొట్టారు.

కోహ్లీ మాట నమ్మా, కానీ మోసం చేశాడు.. అందుకే రిటైర్మెంట్ ఇచ్చేశాను: అమిత్ మిశ్రా



భారత క్రికెట్ వర్గాలలో ప్రస్తుతం ఒక సంచలన వార్త తీవ్ర చర్చనీయాంశమైంది. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కారణంగానే తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ అర్ధాంతరంగా ముగిసిపోయిందని మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా సంచలన ఆరోపణలు చేశారు. భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా నిర్వహించిన పాడ్‌కాస్ట్ బేత్ అండ్ బోల్ లో మిశ్రా పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన పలు జ్ఞాపకాలను, ఆసక్తికర విషయాలని పంచుకున్నారు.

గాయం సమయంలో కుంబ్లే, కోహ్లీ భరోసా:

అమిత్ మిశ్రా తన కెరీర్ ముగింపు గురించి మాట్లాడుతూ.. 2017లో ఇంగ్లాండ్‌తో బెంగళూరులో జరిగిన టీ20 మ్యాచ్‌నే తాను భారత్ తరఫున ఆడిన చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని పేర్కొన్నారు. ఆ మ్యాచ్‌లో గాయపడకపోతే తాను మరిన్ని మ్యాచ్‌లు ఆడేవాడినని తెలిపాడు. ఆ సమయంలో అనిల్ కుంబ్లే భారత జట్టుకు హెడ్ కోచ్‌గా ఉండగా, విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నారు. గాయంతో జట్టుకు దూరమైన సమయంలో.. పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన తర్వాత నీకు మళ్లీ జట్టులో ఛాన్స్ కల్పిస్తామని కోహ్లీ, కుంబ్లే తనకు భరోసా ఇచ్చినట్లు మిశ్రా గుర్తు చేసుకున్నారు.

ఫోన్ చేసినా, మెసేజ్ పంపినా నో రెస్పాన్స్:

గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత తన రీ-ఎంట్రీ గురించి విరాట్ కోహ్లీని సంప్రదించిన ప్రయత్నాలు విఫలమయ్యాయని అమిత్ మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా ఫిట్‌గా మారిన తర్వాత నేను కోహ్లీకి ఫోన్ చేశాను.. వారం నుంచి 10 రోజుల్లోగా సమాచారం ఇస్తానని కింగ్ కోహ్లీ నాతో చెప్పాడు. కానీ వారం, రెండు, మూడు వారాలు గడిచినా అతని నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నాడు. తాను ఎన్నిసార్లు ఫోన్ చేసినా కోహ్లీ ఎత్తలేదని, మెసేజ్‌లు పంపినా రిప్లై ఇవ్వలేదని ఆరోపించాడు. దీంతో తన అంతర్జాతీయ కెరీర్ ఎలాంటి క్లారిటీ లేకుండానే ముగిసిపోయిందని మిశ్రా వాపోయాడు.

చేదు జ్ఞాపకంగా మిగిలిన మిశ్రా కెరీర్:

భారత్ తరఫున టెస్టులు, వన్డేలు, టీ20ల మూడూ ఫార్మాట్లలోనూ రాణించి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన అమిత్ మిశ్రా.. అనుకోని పరిణామాలతో జాతీయ జట్టుకు దూరమయ్యారు. అప్పట్లో కెప్టెన్, కోచ్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో తనను మానసికంగా బాధించిందని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776